# ఎల్ బి నగర్ నియోజక వర్గంలో సమస్యలపై సమీక్ష

## - ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విజ్ఞప్తి



**మెట్రో న్యూస్.ఎల్ బి నగర్ :** నాగోల్ డివిజన్ పరిధిలోని స్వాగత్ హోటల్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు నియోజకవర్గాల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరై నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ పలు అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా బైరామల్ గూడా చెరువు అభివృద్ధికి పూర్తి స్థాయి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. చెరువు అభివృద్ధి పనులకు సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయం ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ.2 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని తెలిపారు. మిగిలిన నిధులను వెంటనే విడుదల చేసి పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హస్తినాపురం జంక్షన్ నుంచి సాగర్ కాంప్లెక్స్ వరకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే ఆనంద్ నగర్ చౌరస్తా వద్ద కూడా ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న వీధి కుక్కల సమస్యపై స్పందిస్తూ, ఇటీవల కుక్కల దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనను ప్రస్తావించారు. స్టెరిలైజేషన్ కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను కోరారు. బి.ఎన్.రెడ్డి నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని సూచించారు. అలాగే టీకేఆర్ కాలేజ్ సమీపంలో ప్రతిపాదిత ఫ్లైఓవర్ ప్రస్తుతం అవసరం లేదని, ఆ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని కోరారు. బీ.డి.రెడ్డి గార్డెన్ సమీపంలో భూ వివాదాల కారణంగా నిలిచిపోయిన స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులను వెంటనే పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హస్తినాపురం డివిజన్‌లోని ద్వారకా తిరుమల నగర్ ప్రాంతంలో ఒక మీటర్ పైప్‌లైన్ విస్తరణ చేపట్టి తాగునీటి సరఫరాను బలోపేతం చేయాలని కోరారు. అలాగే మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డు సమీపంలోని పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ కోసం అటవీ శాఖ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువుల వద్ద ఎస్‌టీపీ ప్లాంట్లు ఏర్పాటు చేసి చెరువుల సుందరీకరణ పనులు చేపట్టాలని కూడా ఎమ్మెల్యే కోరారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖలు ప్రాధాన్యత ఆధారంగా స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.

## దొంగిలించిన నగలను తిరిగి రాబట్టిన మంచాల పోలీసులు

### - చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా మంచాల మండలం మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన నల్గొండ జిల్లా చందుపట్లకు చెందిన బాణాల హరిచంద్ర ప్రసాద్ (19)ను మంచాల పోలీసులు అరెస్ట్ చేశారు. మంచాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మధు తెలిపిన వివరాలు ప్రకారం. నిందితుడు బాణాల హరిచంద్ర ప్రసాద్ ఈ నెల 4న చీదేడ్‌లో, 11న బంధువు గౌరారపు రాముతో కలిసి యర్రగడ్డలగూడెంలో మహిళల మెడలోని బంగారు పూసల తాళ్లను లాక్కొని పరారయ్యాడు. ఈ నెల 21న ఆగపల్లి ఎక్స్ రోడ్ వద్ద మంచాల పోలీసులు సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా తనిఖీల్లో చైన్ స్నాచర్ పట్టుబడగా 30 గ్రాముల బంగారు పూసల తాడు స్వాధీనం చేసుకున్నారు. ఆర్థిక అవసరాలు, మద్యం అలవాటు కారణంగా నేరాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసుకొని ఇంకా గతంలో ఏమైనా దొంగతనాలు చేశాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సిఐ మధు తెలిపారు

## నిద్రిస్తున్న వృద్ధురాలు మెడలోంచి 4 తులాల పుస్తెల తాడు చోరీ

### - అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి 4తులాల బంగారు పుస్తెలతాడు లాకెళ్లిన దుండగులు. ఈ ఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రానికి చెందిన బోడిగే దర్శన్ (80), అయన భార్య భరతమ్మ(76) అబ్దుల్లాపూర్మెట్ పాత గ్రామంలో నివసిస్తుండగా గురువారం తెల్లవారుజామున 2.44గంటల సమయంలో డోరు తెరిచి ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి చొరబడి వారిని బెదిరించి ఆమె మెడలోని సుమారు 4తులాల బంగారు పట్టిని బలవంతంగా లాక్కొని పారిపోయాడు. దింతో వారి కుమారుడు దర్శన్ ఫిర్యాదు మేరకు అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## నాణ్యత ప్రమాణాలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం : నాయినేని


**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** ప్రజల అవసరాలకు తగ్గట్లుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంతారావు అన్నారు. వివేకానందనగర్ డివిజన్‌లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులను గురువారం సెక్షన్ మేనేజర్ అనిల్‌తో కలిసి చంద్రకాంతారావు పర్యవేక్షించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా నాణ్యత ప్రమాణాలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యేలా చంద్రకాంతరావు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ మార్గనిర్దేశంలో ముందుకు నడుస్తూ డివిజన్ లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ సమగ్రాభివృద్ధికి ఎల్లవేళలా ముందుంటానని స్పష్టం చేశారు.

## బీఎల్‌ఓల గ్రౌండ్ అకౌంట్బులిటి పెంచండి: బి ఆర్ఎస్ నేత రాజిరెడ్డి



**పరిగి మెట్రో న్యూస్ :** బూత్ లెవల్ అధికారుల్లో గ్రౌండ్ లెవల్ నైపుణ్యం పెంచుతూ సరిగ్గా పని చేయని వారి పై దృష్టి పెట్టాలని దోమ మండల బీఆరెస్ నేత కె రాజిరెడ్డి తహసీల్దార్ గోవిందమ్మ ను కోరారు. గురువారం దోమ తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్షన్ రివిజన్ పై జరిగిన పొలిటికల్ పార్టీల సమావేశంలో పా ల్గొన్న అయన ఇంటింటి సర్వే చేయకుండా షిఫ్టింగ్ డెత్ డబల్ ఓట్ల పై దృష్టి పెట్టకుండా పాత లిస్టుల్లో టిక్కులు కొట్టడం పంపించడం తీరా డ్రాఫ్ట్ లిస్ట్ లో అభ్యన్తరలు చూపిస్తే కూడా పట్టించు కొని పరిస్థితి లు ఉన్నాయనీ రాజిరెడ్డి తెలిపారు. కింది స్థాయిలో ఎన్నికల విధుల్లో పనిచేసే వారి పై మండల బాధ్యతలు చూసే వారు పట్టించు కొక పోవడం తో గ్రామాల్లో అనేక తప్పుల తడక గా ఓటర్ల జాబితాలు ఉన్నాయన్నారు గ్రామాల్లో ఇళ్ళు ఉన్న వార్డులో ఓటు వేయని వారు దాదాపు పది శాతం ఉన్నారు. బోగస్ ఓటర్ల గుర్తింపు కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న సర్ నిబంధనల్లో భాగంగా 2001-02 లోని ఓటర్ల జాబితా చిరునామా ఆధారంగా ఉన్న కుటుంబ యజమాని ఇంటి పేరు 2021-22 లోని ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టి ఇంటి చిరునామా ఫ్యామిలీ ట్రీ ఆధారంగా బోగస్ ఓట్ల శుద్ధి చేస్తున్నందున ఇంటి పేర్లు గాని రిలేషన్ షిప్ ల్లో గాని చిన్న తప్పులు ఉన్న ఓటర్లను తీసి వేయొద్దు అని రాజిరెడ్డి సూచించారు. ఈ విషయం పై తాసిల్దార్ గోవిందమ్మ స్పందిస్తూ బోగస్ డబల్ డెత్ ఉన్న ఓటర్ల ను గుర్తించి మా సిబ్బందికి సహకారం అందించాలి అని కోరారు. సమావేశం లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శాంత కుమార్ మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్ రెడ్డి ప్రభాకర్ రెడ్డి సర్పంచ్లు పలు సూచనలు చేసారు.

## ఇర్విన్‌లో చెన్నకేశవ స్వామి దేవాలయ భూమిపై వివాదం



**మాడ్గుల, మే 20 (మెట్రో న్యూస్):** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 11లో వ్యవసాయ భూమి చెన్నకేశవ స్వామి దేవాలయానికి చెందినదా,కాదా అనే అంశం పై గత కొన్ని సంవత్సరాలుగా అనిశ్చితి నెలకొంది. రెవెన్యూ రికార్డులలో దేవాలయం పేరు స్పష్టంగా ఉన్నప్పటికీ అధికారులు నిరాకరిస్తుండటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తక్షణమే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 1954 ఖాస్రా పహాణీలో రికార్డుల ప్రకారం సర్వే నెంబర్ 11లో వ్యవసాయ భూమి చెన్నకేశవ స్వామి దేవాలయం పేరు మీద నమోదై ఉంది. రెవెన్యూ రికార్డుల పరంగా ఇది దేవాలయం భూమిగానే గుర్తించబడింది. అయితే ప్రస్తుత రెవెన్యూ అధికారులు మాత్రం ఈ భూమి దేవాలయానికి సంబంధించినది కాదని చెబుతుండటంతో వివాదం కొనసాగుతోంది. గ్రామస్తులు కొందరు మా తాత ముత్తాతల కాలం నుంచి సర్వే నెం 11 వ్యవసాయ భూమి చెన్నకేశవ స్వామి దేవాలయ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని గ్రామస్తులు కొంతమంది చెప్పారు .ఖాస్రా పహాణీలో స్పష్టంగా దేవాలయం పేరు ఉన్నప్పటికీ సంబంధిత రెవెన్యూ,దేవాదాయ శాఖ అధికారులు కుమ్మక్కై ఈ భూమి దేవాలయానికి చెందినది కాదని చెప్పడం అన్యాయం అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదాయ భూముల పరిరక్షణ చట్టం ప్రకారం దేవాలయాలకు చెందిన భూములను ఇతరులు ఆక్రమించడానికి వీల్లేదు. రికార్డుల్లో దేవాలయం పేరు ఉన్నప్పటికీ అధికారులు నిరాకరించడం పలు అనుమానాలకు తావిస్తోందని భక్తులు,గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమిని అన్యాక్రాంతం చేసే కుట్ర జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై తక్షణమే జిల్లా కలెక్టర్,దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్పందించి 1954 ఖాస్రా పహాణీతో పాటు సెటిల్‌మెంట్ రికార్డులు,ప్రస్తుత 1-బి, పహాణీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సర్వే నెం. 11పై నెలకొన్న అనిశ్చితిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. విచారణలో దేవాలయ భూమిగా తేలితే వెంటనే సరిహద్దులు నిర్ణయించి, దేవాదాయ శాఖ బోర్డు ఏర్పాటు చేసి భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో గ్రామస్తులంతా ఏకమై పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నత అధికారులు ఏ విధంగా స్పందిస్తారో మరో కథనంతో పాఠకుల ముందుకు.

## ధాన్యాన్ని అడ్డంగా ఆరబోస్తే కేసులు నమోదవుతాయి పోలీసుల హెచ్చరిక... తస్మాత్ జాగ్రత్త



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రోడ్లపై అడ్డగోలుగా రైతులు ధాన్యం ఆరబోస్తే, ఇకపై కేసులు నమోదు అవుతాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ. రాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల్లో రోడ్డు అడ్డంగా రైతులు ధాన్యాలు ఆరబోస్తున్నారని, ఇంకా రోడ్డు మధ్యలో కుప్పలుగా పెట్టడంతో ధాన్యాన్ని తప్పించబోయి పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతూ ఎంతోమంది ఆస్పత్రుల పాలవుతున్నారని అన్నారు. ముఖ్యంగా వాహదారుల్లో కాలరు బైకులు ధాన్యాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఇతర వాహనాలకు ఢీకొనడంతో అనేక ప్రమాదాలు జరుగుతూ ప్రాణాలు సైతం కోల్పోతున్నారని తెలిపారు. యువత ఎక్కువ ప్రమాదాలకు గురవుతుండడం చాలా బాధా కలిగించే విషయమని తెలిపారు. ఈ ప్రమాదాలను తక్షణమే నివరించడానికి తాము రైతులను ముందస్తుగా హెచ్చరిస్తున్నామని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు అడ్డంగా, రోడ్డు మధ్యలో వరకు ధాన్యం ఆరబెట్టడం, ధాన్యం పోయడం పూర్తిగా నిషేధమని ఎవరైనా రోడ్డుపై ఈ విధంగా ధాన్యం ఆరబోసిన, ధాన్యం విలువ చేసిన వారిపై కఠినమైన కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. కేవలం రోడ్డు ప్రమాదాలు అరికట్టడానికి మాత్రమే తామ రైతులకు ఈ విధంగా ఆంక్షలు విధించడం జరుగుతుందని ఏసీపీ తెలిపారు.

## మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం : బండి రమేష్



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** పేద ప్రజల అభ్యున్నతికి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ అన్నారు. రాజీవ్ వర్ధంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ, బాలానగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న విగ్రహాలకు పార్టీ నాయకులతో కలిసి గురువారం రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాస్త్ర, సాంకేతికరంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత రాజీవ్ కే దక్కుతుందని సేవలను కొనియాడారు. రాజీవ్ ఆశయ సాధనకై ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి, ఏ-బ్లాక్ ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, పులిశ్రీకాంత్‌పటేల్,తూముపేణు,నాగిరెడ్డి,నరేందర్ ముదిరాజ్, పుష్పారెడ్డి, మధుగౌడ్, పెద్దసంఖ్యలోకార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పూర్తిచేసి వసతులు మెరుగుపరుస్తాం : ఎమ్మెల్యే



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో వందల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం పనులు చేపట్టామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వాటిలో కొన్ని ఇప్పటికే పూర్తై అందుబాటులోకి రాగా, మిగతావి త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ, ఆంజనేయనగర్ చౌరస్తా అభివృద్ధికై నిధులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. త్వరగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు వసతులు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, టౌన్ ప్లానింగ్, మున్సిపల్, వాటర్ వర్క్స్ అధికారులతోపాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు శాపంగా మారుతున్న పర్యావరణం

### - ప్రముఖ సంగీత దర్శకులు బల్లెపల్లి మోహన్, సీజీఆర్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మిరెడ్డి



**మెట్రో న్యూస్ కడ్తాల్ :** నానాటికి పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం కారణంగా సంభవిస్తున్న వాతావరణ మార్పుల ప్రభావాల రీత్యా మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న సమయంలో ప్రజలను చైతన్య పరిచి ప్రభుత్వాలను మేల్కొలిపే ప్రయత్నంలో భాగంగా పొంచి ఉన్న ప్రమాదాన్ని విస్తృతంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నంలో భాగంగా ది ఎర్త్ సెంటర్ లో కవులు, రచయితలు, కళాకారులతో ఏర్పాటు చేయబడిన రెండు రోజుల సమావేశం నేడు ముగిసింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా ప్రముఖ సంగీత దర్శకులు బల్లేపల్లి మోహన్ పాల్గొని మాట్లాడుతూ గడిచిన గత కాలంలో ప్రకృతి సంపద విచ్చలవిడిగా అవసరానికి మించి వినియోగించడం కారణంగా నేడు భవిష్యత్ తరాలకు ఇది శాపంగా మారుతుందని అన్నారు. మన పాపం రాబోయే తరాల పాలిట శాపంగా మారకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర ఉద్యమం నుండి స్వరాష్ట్ర తెలంగాణ సాధన వరకు కవులు రచయితలు కళాకారుల పాత్ర వర్ణించలేనిదని నేడు హరిత ఉద్యమంలో అదే తీరులో కలం, గళం కదలాలని అన్నారు. అనంతరం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి లీలా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి మాత ఋణం తీర్చుకునే ప్రయత్నంలో మాతో కలిసి నడిచేందుకు విచ్చేసి ఈ రెండు రోజుల సమావేశాన్ని విజయవంతం చేసిన కవులు, రచయితలు, కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి జి ఆర్ సంస్థ ఫౌండర్ లక్ష్మిరెడ్డి ,వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్ రావు ,డా. జగన్,ఎస్కె చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ఎస్కె లెనిన్ బాబు, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ నక్క సాయి భాస్కర్ రెడ్డి , యానాల వెంకట రెడ్డి , ఉమా మహేశ్వర్ రెడ్డి , సుస్థిర పుడమి పత్రిక సంపాదకులు రమేష్ రావు, కవులు రచయితలు కళాకారులు, సిజిఆర్ సంస్థ సిబ్బంది మామిడి శంకరయ్య, నాగేష్, రజనీకాంత్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.